23న ముఖ్యమంత్రి పర్యటన ఖరారు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఈనెల 23న ఖరారైనట్లు స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామ సభల్లో భాగంగా కొత్తపేట మండలం వానపల్లి జరిగే గ్రామసభలో సిఎం పాల్గొంటారని తెలిపారు. సభా ప్రాంగణాన్ని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తో కలిసి పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశ్రమల ప్రోత్సాహానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌పేర్కొన్నారు. బుధవార కలెక్టరేట్లో జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్లు, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లతో కన్సల్టేటివ్ సమావేశాన్నికలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో పరిశ్రమల అభివృద్ధి విధానం 2024-29, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎంటర్ప్రెన్యూర్షిప్ విధానం 2024-29, ఆహార ప్రొసెసింగ్ విధానం 2024-29 లను అమలులోకి తీసుకురానుందన్నారు. ఈ పాలసీల ఏరియా లలో ఉండే సమస్యలు సవాళ్లు అవకాశాల గురించి స్టేక్ హోల్డర్స్‌తో చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కొబ్బరి ఎక్కువగా ఉత్పత్తి అవుతుందని కొబ్బరి ఆధారిత పరిశ్రమలను జిల్లాలో నెలకొల్పే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అగ్రి ఇన్ఫ్రా ఫండ్ కింద కొబ్బరి కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రతినిధులు కలెక్టర్‌కు విన్నవించారు. ఎంఎస్ఎం ఈ ప్రతినిధుల సమస్యలను సంబంధిత కార్యదర్శులకు నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టికెపి.ప్రసాద్, ఎమ్మెస్ ఎంఇ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, రైస్ మిల్లర్ల ఆర్గనైజేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు

కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి తహశీల్దారులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 77,780 మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులను మంజూరు చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటివరకు 49,460 మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు మంజూరు చేశామన్నారు. తహశీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, విఆర్ఒలు, గ్రామ వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి గ్రామంలో ఎంతమంది కౌలు రైతులు భూమిని సాగు చేస్తున్నారో కచ్చితమైన డేటాను సేకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే జిల్లాకు కేటాయించిన సిసిఆర్సి కార్డుల మంజూరు లక్ష్యం కంటే రెండు మూడు రెట్లు అధికంగా కౌలు రైతులు ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 166 ప్రయిమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీల ద్వారా సిసిఆర్సి కార్డులు ఉన్న కౌలు రైతులందరికీ ఏడు శాతం వడ్డీతో పంట రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దారులు, మండల వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సమన్వయంతో పనిచేసి కౌలు రైతులందరికీ పంట రుణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వర్షాల సమయంలో పంట తడిచిపోకుండా ఉపయోగపడే టార్పాలిన్లు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని అవసరమవుతాయో అన్న వివరాలను కలెక్టరేట్ కు పంపితే అవసరమైన వాటిని ప్రొక్యూర్ చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఈ పంట నమోదు పై అవగాహన కల్పించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, జెడి అగ్రికల్చర్ బోసు బాబు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి మురళీకృష్ణ, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న తొలకరి వరి చేలు

పది రోజులుగా అందని సాగునీరు

ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

తొలకరి వరిచేలకు సాగునీరు అందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. కె.గంగవరం మండలంలోని దంగేరు, కుడుపూరు ప్రాంతాల్లో సాగునీరు సక్రమంగా అందక పది రోజులుగా తొలకరి వరి చేలు బీటలు వారాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో పెట్టుబడులు పెట్టిన రైతులు తొలకరిలోనూ సాగునీరు అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాశక్తితో దంగేరుకు చెందిన రైతులు నేల శ్రీనివాసరావు, పంపన ప్రకాష్ దెంగేటి వెంకన్న గెద్దాడ సూర్యనారాయణ శ్రీను మాట్లాడుతూ వెంకటాయపాలెం పరిధిలో దంగేరు పంట పొలాల్లో సుమారు 50 ఎకరాలు పంటచేలు బీటలు వారాయని దీనిపై అధికారులకు తెలిపినా ఉపయోగం లేదని రైతులు వివరించారు. శివల, కుడుపూరు దంగేరు ప్రాంతాల్లో పంట పొలాలకు కాలంలో నీటి ప్రవాహం తగ్గిపోవడంతో చేలకు నీరు అందడం లేదని రైతులు వివరించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి కాలువల్లో నీటి సాంద్రత పెంచాలని తొలకరి వరిచేలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



దంగేరులో సాగునీరందక బీటలు వారిన వరి పొలాలు

నీటి సాంద్రత పెంచేందుకు చర్యలు

తొలకరి వరిచేలు దంగేరు ప్రాంతంలో ఎండిపోతుండడంపై పంట కాలవల్లో నీటి సాంద్రత పెంచేందుకు చర్యలు చేపడతాము. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది. ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యను తెలుసుకునేందుకు రైతులను కలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తాము. **- వెలగా రామకష్ణారెడ్డి, ఇరిగేషన్ డిఇ**

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఎల్ఎ బండారు సత్యానందరావు
- రావులపాలెంలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-రావులపాలెం

గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం రావులపాలెం శ్రీ సత్య సాయి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో యువ నాయకుడు బండారు సంజీవ్ పుట్టినరోజు సందర్భంగా సంజీవ్ ఆధ్వర్యంలో వికాస సారథ్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, ఆర్‌డిఒ జివివి.సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత ఎంఎల్ఎ బండారు సత్యానందరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అయిదేళ్లలో ప్రభుత్వ, ప్రయివేటు సెక్టార్లతో కలిపి 20 లక్షల ఉద్యోగాలు కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. నేటి జాబ్ మేళాలో 2025 ఉద్యోగాలు భర్తీ చేయడం, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మొదలుకొని ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్,పీజీ చదివిన వారికి అవకాశాలు కల్పించడం శుభ పరిణామ న్నారు. హెచ్‌సిఎల్, టెక్ మహేంద్ర, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు అనేక కంపెనీలు ఈ జాబ్ మేళాలో నిరుద్యోగులకు అవకాశాలు కల్పించడం సంతోషకరమని ఆయన అన్నారు. వివిధ ప్రాంతాల్లో విభిన్నమైన కళాశాలలో చదువుకున్న యువతకు వారి సామర్థ్యాల గణనకు ఈ జాబ్ మేళాలు దిశా నిర్దేశం చేస్తాయన్నారు. ఇటువంటి జాబ్ మేళాలు ఆరు నెలలకు ఒకసారైనా నిర్వహిస్తూ ఉండడం మంచిదని ఎంఎల్ఎ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వికాస ఎండి లచ్చరావు, రమేష్, గ్లోసరీ సాఫ్ట్ టెక్ ఎండి లలిత, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకష్ణ, సీనియర్ నాయకులు కెవి.సత్యనారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, కొత్తపేట మండల పార్టీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, ఆత్రేయపురం మండల పార్టీ అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, అమలాపురం పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, కరుటూరి నరసింహారావు, ధరణాల రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ బండారు సత్యానందరావు

మనోవికాస కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, డైరెక్టర్ జిల్లాలో గల జువెనల్ జస్టిస్ బోర్డు యాక్ట్ పరిధిలోకి వచ్చే అన్ని చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లను సందర్శించాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. బుధవారం జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారి అమలాపురం మండలంలోగల కామాక్షి ప్రేమ మందిరం, హరి మనోవికాస కేంద్రాలను సందర్శించారు. లైసెన్సింగ్ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ అయ్యాయా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న చిన్నారులతో మాట్లాడి వారి యోగ క్షేమాలు అడివి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, సదుపాయాలకు సంబంధించి సంస్థ సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. వీరి వెంట జిల్లా నోడల్ అధికారి, డిసిపిఒ, స్థానిక సిడిపిఓ తదితరులు ఉన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారిణి

గ్రామసభలపై ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని ఈ నెల 23న 17 గ్రామాల పంచాయతీల వద్ద నిర్వహించనున్న గ్రామ సభలకు సంబంధించి బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ నాతి బుజ్జి సమీక్ష సమావేశము నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 23న మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా 24-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులు, ప్రతిపాదనల కొరకు ఈ పనులపై అవగాహన కొరకు సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచుల అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలన్నారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులు గురించి సంబంధిత మండల స్థాయి అధికారులతో చర్చించారు. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ లు ఉపాధి హామీ వేతనదారులు గ్రామ సభల్లో పాల్గొనేటట్లు చూడవలసినదిగా ఎపిఒ విజయభారతి ని ఆదేశించారు. డ్వాక్రా మహిళలు అందరూ గ్రామ సభల్లో పాల్గొనేటట్లు చూడవలసినదిగా వెలుగు అధికారిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు అందరు టాంటాం ద్వారా విస్తత ప్రచారం కల్పించి గ్రామ సభకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు అనుసంధానం చేయబడిన శాఖలు పంచాయతీ రాజ్ గ్రామీణావృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, హార్టికల్చర్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫారెస్ట్, హౌసింగ్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు అందరూ గ్రామ సభలకు హాజరు కావాలన్నారు.



సన్మానిస్తున్న శంకర్ గౌడ్ తదితరులు

ఎంఎల్ఎ ఆనందరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శాసనసభ సభ్యులు అయితాబత్తుల ఆనందరావును బుధవారం ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్, తన సహచరులతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువా, అభినందన జ్ఞాపిక తో ఎంఎల్ఎను సన్మానించారు. అనంతరం కుమార్ శంకర్ గౌడ్ రాసిన ఆధ్యాత్మిక పుస్తకాలను బహూకరించి ఎంఎల్ఎకి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అయినవిల్లి నాగేంద్రకుమార్ గౌడ్, ఐవి.రామకష్ణ, నార్గన శ్రీనివాస్, రేలంగి మధు, రాజులపూడి మహేశ్వరరావు, ఎ.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు ఎంపిడిఒగా జాన్ లింకన్

ప్రజాశక్తి-ఆలమూరు

ఆలమూరు ఎంపిడిఒగా కె.జాన్ లింకన్ బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు జరిగిన బదిలీల్లో ఆయన వెళ్లి తిరిగి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపిడిఒ బాధ్యతలు నిర్వహించిన ఎ.మేరీ రోజ్ బదిలీపై వెళ్లారు. ఎంపిడిఒ జాన్ లింకన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బంద్ విజయవంతం

- జిల్లాలో డిపోల వద్ద నిలిచిపోయిన బస్సులు
- నిర్మానుష్యంగా మారిన ప్రధాన రోడ్లు
- మూతపడిన విద్యా, వాణిజ్య, వ్యాపార సంస్థలు



నిర్మానుష్యంగా కాట్రేనికోన గేట్ సెంటర్



అమలాపురంలో బ్యాంక్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎస్సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం చేపట్టిన బంద్ విజయవంతం అయింది. బుధవారం తెల్లవారుజామునే మాల సామాజికవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చారు. ఆర్‌టిసి బస్సులను అడ్డుకున్నారు. ప్రయివేటు కార్యాలయాలు, విద్యాలయాలు, కిరాణా, ఇతర ఫ్యాన్సీ షాపులు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. అక్కడక్కడా తెరిచిన షాపులు, ప్రభుత్వ కార్యాలయాలను ఆందోళనకారులు మూయించివేశారు. పలు ప్రాంతాల్లో రోడ్లుపై రాస్తారోకోలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు.

అమలాపురం: తెల్లవారుజామునుండే దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు భారీ ధర్నా నిర్వహిం చారు. వర్గీకరణ పేరుతో ఎస్‌స్ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, దళిత ఐక్యవేదిక నాయకులు డి.బి.లోక్ జంగా బాబురావు, ఇసుక పట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, కోట రామ్మోహన్రావు, గొల్లపల్లి డేవిడ్, బడుగు జేమ్స్ పాల్, నెల్లి లక్ష్మీపతి, యువత, మహిళలు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ పార్టీలకతీతంగా దళిత నాయకులు బంద్ చేపట్టారు. మండల వ్యాప్తంగా ఉన్న వాణిజ్య, వర్తక, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటుపాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు మూసివేశారు.కార్యక్రమంలో పార్టీలకతీతంగా దళిత వర్గానికి చెందిన కూటమి, వైసిపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** మండలంలోని మాల మహానాడు, ఎస్సి ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల, అంబేద్కర్ యువజన, అభ్యుదయ, విద్యార్థి, ప్రజా సంఘాలు మరియు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, కాంగ్రెస్, వైసిపి, టిడిపికి చెందిన ఎస్సి నాయకులు బంద్ లో పాల్గొన్నారు. మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పల్లి పాలెం సెంటర్ లో జాతీయ రహదారి 216 పై బైఠాయించి ధర్నా చేపట్టారు. బంద్ సందర్భంగా వ్యాపార సంస్థలు, పాఠశాలలు మూత పడ్డాయి. **రామచంద్రపురం:** సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఎస్సి వర్గీకరణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా దళితులు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం భారత్ బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచి రామచంద్రపురం డిపోకు చెందిన బస్సులను ఎక్కడికక్కడ నిలిపివేశారు. అదేవిధంగా విద్యాసంస్థలన్నీ మూతపడ్డాయి. వాణిజ్య వ్యాపార సంస్థలు తెరుచుకోలేదు. రామచంద్రపురం డిఎస్‌పి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ముఖ్యమైన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించారు. రామచంద్రపురం, ద్రాక్షారామర్, కె.గంగవరం మెయిన్ రోడ్లు వెలవెల పోయాయి. పలువురు దళిత నాయకులు బంద్ ను పర్యవేక్షించారు. **ఆలమూరు :** మండల పరిధిలో 18 గ్రామాల్లో వివిధ సంఘాల ప్రతినిధులు ఆధ్వర్యంలో బంద్ విజయవంతమయింది. చెముడులంకలో ఆదర్శ యూత్ కమిటీ ప్రభుత్వ ఆఫీసులు, బ్యాంకులు, విద్యాలయాలు, షాపులు, మూసివేసి బంద్ కు సహకరించాలని కోరారు. బిఎస్‌పి కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు గుర్రపు కొత్తియ్య మాట్లాడారు. కార్యక్రమంలో జి.రత్నంరాజు, టి.క్రాంతికుమార్, ఎ.సుదర్శన్, ఎ.చిన్న బాబు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. **మామిడికుదురు :** ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం మండల మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో మామిడికుదురు సెంటర్లో 216వ జాతీయ రహదారిపై బైఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యాపారసముదాయాలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్ చేయించారు. కార్యక్రమంలో బొంతు మణిరాజు, నెల్లి దుర్గాప్రసాద్, మట్టాసత్తిబాబు, కలిగితి పళ్లంరాజు తదితరులు పాల్గొన్నారు. **రాజోలు :** భారత్ బంద్ రాజోలులో ప్రశాంతంగా ముగిసింది. రాజోలు డిపో లో బస్సులను నిలుపుదల చేశారు. జెఎసి నాయకులు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ తీర్పు మాలలకు వ్యతిరేకంగా ఉందని, 11 మంది ధర్మాసనంతో కూడిన బెంచి ఏర్పాటు చేసి తీర్పును పున్హసమీక్షించాలన్నారు. కార్యక్రమాని మాజీ ఎంఎల్ఎలు రాపాక వరప్రసాద్, గొల్లపల్లి సూర్యారావు, కొండేటి చిట్టిబాబు మద్దతు తెలిపారు. అనంతరం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలు బంద్ కారణంగా మూతపడ్డాయి. కార్యక్రమంలో దళిత సంఘాల నాయుకులు బత్తుల మురళీకృష్ణ, మట్టా సురేష్, లికితపూడి బుజ్జి, సరేళ్ల విజయ్, జగడం సత్యనారాయణ, నక్కా రామారావు దళిత నాయకులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం :** ఎస్ సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పించిందంటూ నిరసనగా బుధవారం తలపెట్టిన భారత్ బంద్ మండలంలోని అన్ని గ్రామాలలో ప్రశాంతంగా ముగిసింది.ప్రభుత్వ కార్యాలయాలు వ్యాపార విద్యాసంస్థలు మూతపడ్డాయి. మండల మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి, మాల మహానాడు జెఎసి నాయకులు కుంచే బాబులు నాయకులు మండలంలోని 17 గ్రామపంచాయతీలలో పర్యటించి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. **అయినవిల్లి:** ఎస్సి వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ సందర్భంగా బ్యాంకులు, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాలు తో పాటు పెట్రోల్ బంక్‌లు, ప్రయివేటు వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. అమలాపురం డిపో నుంచి బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రైవేట్ వాహనాలు సైతం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ హైస్కూల్ సెంటర్ నుండి అంబేద్కర్ కూడలి వరకు నిరసన ప్రదర్శన చేశారు. గిడ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అరవై ఉపకులాలు గల ఎస్సి జాబితాను నాలుగు భాగాలు చేయడం ద్వారా సామాజిక న్యాయం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు.. భవిష్యత్తులో ఈ విషయమై తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వివరించారు. ఈసందర్భంగా చింతలనంకలో రెండు గ్రూపులు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కార్యక్రమంలో గిడ్ల వెంకటేశ్వరరావు, కొంకి వెంకట రావు, జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ జెడ్‌పిటిసి గుమ్మడి వెంకటేశ్వరరావు, మోత వెంకటేశ్వర రావు, గుమ్మళ్ళ సాగర్, దళితులనాయకులుపాల్గొన్నారు. **రావులపాలెం:** ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. రావులపాలెంలో బుధవారం మాలమహానాడు ప్రతినిధులు ఆర్‌టిసి బస్ డిపో వద్ద, స్థానిక కళావెంకట్రావు జంక్షన్ జాతీయ రహదారిపై మానవహారంగా ఏర్పడి బంద్ నిర్వహించారు. మండల జెఎసి ఆధ్వర్యంలో బస్ డిపో, బస్టాండ్, జాతీయ రహదారిపై బైఠాయించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియచేసి నినాదాలు చేసారు.రావులపాలెం బస్ డిపో నుండి బస్సులు బయటకు రాకుండా బంద్ నిర్వహించారు.మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ మాల మహానాడు జెఎసి నాయకులు పాల్గొన్నారు.



రామచంద్రపురం డిపో వద్ద నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సులు



ఉప్పలగుప్తంలో బంద్ కారణంగా మూతపడ్డ దుకాణాలు




రాజోలులో ఆందోళన చేస్తున్న దళిత నాయకులు



అయినవిల్లిలో బంద్‌లో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

కార్టూ'నిజం'



23న జాతీయ అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర విద్యాశాఖ వారి ఆదేశానుసారం జాతీయ అంతరిక్ష దినోత్సవం-2024 పురస్కరించుకుని జిల్లా స్థాయిలో జెడ్‌పి ఉన్నత పాఠశాల, వన్నె చింతలపూడి గ్రామంలో యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా విద్యాశాఖతో కలిసి ఈనెల 23న ఉదయం 9 గంటలకు అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించడానికి సన్నా హాలు చేస్తున్నట్లు డిఇఒ ఎం.కమల కుమారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రయాన -3 చంద్రుడిపై అడుగు పెట్టిన ప్రదేశాన్ని శివశక్తి పాయింటుగా నామ కరణం చేసిన అంశాన్ని పురస్కరించుకొని జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారన్నారు. భారత దేశం అంతరిక్ష యాత్రలోని పాత్ర, అంతరిక్ష ప్రయాణంలో ఎదుర్కొనే సమస్యలు, విజయాలు వంటి అంశాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఉదయం 9 గంటలకు మాజీ ఇస్రో శాస్త్ర వేత్త యాళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ను నిర్వహిస్తారన్నారు. .అదేవిధంగా భారతదేశం అంతరిక్ష యాత్ర - ప్రపంచ అభివద్ధికి మన పాత్ర అనే అంశంపై క్విజ్ మరియు వక్తత్వ పోటీలను కూడా మధ్యాహ్నం ఒంటి గంట నుండి నిర్వహిస్తారన్నారు.వక్తత్వ పోటీలకోసం, ప్రతి పాఠశాల నుంచి ఒక విద్యార్థిని లేదా విద్యార్థి, రెండు నిమిషాల వ్యవధిలో భారత దేశం అంతరిక్ష యాత్రపై మాట్లాడిన ఆ వీడియోను యూట్యూ బ్‌లో అప్లోడ్ చేసి, ఆ యూట్యూబ్ లింక్‌ను జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం వారికి 22వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటల లోపు సమర్పించాలన్నారు. అందులో ఉత్తమంగా ఎన్నికైన ఐదు మందిని, జిల్లా అంత రిక్ష దినోత్సవం రోజైన శుక్రవారం సత్కరిస్తారని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లా నుంచి అన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆసక్తి కలిగిన విద్యార్థుల కోసం వన్నె చింతలపూడి లో క్విజ్ పోటీలను కూడా నిర్వహిస్తారని, మీ పాఠ శాలల్లో ఆసక్తి కలిగిన విద్యార్థు లను ఈ పోటీల్లో పాల్గొన డానికి ప్రోత్సహించాలన్నారు. కార్యక్ర మం విజయవంతం చేయడానికి సహ కారం అందించాలని మండల విద్యాశాఖ అధికారులను ప్రధానోపాధ్యాయులను సుబ్రహ్మణ్యం కోరారు.

ఒఎన్‌జిసి నష్టపరిహారంపై అసత్య ప్రచారాలను నమ్మొద్దు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

మత్స్య కారులకు ఒఎన్‌జిసి నష్టపరిహారం అందిస్తున్నట్లు వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ముమ్మిడివరం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. రెండు రోజులుగా నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు ఒఎన్‌జిసి సంస్థ ద్వారా అందించే నష్టపరిహారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, కావాలని కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం తెలిపింది. నష్టపరిహారం చెల్లించే విషయం త్వరలోనే పత్రికల ద్వారా తెలియజేస్తామంది.

నేరాలు ఘోరాలు

దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

దాడి ఘటనలో వ్యక్తిపై సీతానగరం ఎస్ఐ ఫణి మోహన్ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం గ్రామంలో లంకూరుకు చెందిన దుళ్ళ మహాలక్ష్మి అనే వ్యక్తి ఆగస్టు 19వ తేదీన రోజువారీ పనిలో భాగంగా సీతానగరం లంకలో గేదెలను మేపడానికి తీసుకుని వెళ్ళాడు. అతనితోపాటు లంకూరుకి చెందిన మాగాపు దుర్గాప్రసాద్ అనే వ్యక్తి కూడా గేదెలను మేపడానికి వెళ్లగా అక్కడ ఇద్దరిమధ్య వాగ్వాదం జరిగింది. మాగాపు దుర్గాప్రసాద్ దుళ్ళ మహాలక్ష్మి అను వ్యక్తిని వెనుక నుండి టవల్‌తో మొహం కప్పి కర్రతో తలపై, వీపుపై , కుడు చేతిపై దాడి చేయగా దుళ్ళ మహాలక్ష్మి స్పృహ కోల్పోయాడు. అనంతరం గోదావరిలో విసిరేసాడు. కుటుంబ సభ్యులు అతని కోసం వెతకగా గోదారి గట్టు వద్ద గాయాలతో పడి ఉండగా వెంటనే సీతానగరం రమా నర్సింగ్ హోమ్‌కు తీసుకుని వెళ్లి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి జిఎస్ఎల్ హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. దుళ్ళ మహాలక్ష్మి వాంగ్మూలం రికార్డ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఫణి మోహన్ తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె.కొత్తూరు పరిధిలో సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో బుధవారం ఎస్ఐ టి.రఘునాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిల్వ చేసిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారాను తయారు చేస్తున్న గూడుపు వెంకటరమణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరంపై కేసు నమోదు అయింది. ఎస్ఐ యువి.శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన పుచ్చకాయల వెంకటరమణ కి ఒక గుర్తు తెలియని నెంబర్ నుంచి లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేయడంతో తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.2.62 లక్షల నగదు విత్‌డ్రా అయిపోయింది. ఈ మేరకు బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసును జగ్గంపేట సిఐ ఎస్.లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరం 216వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బుధవారం ఇద్దరు గాయపడ్డారని హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన పీతల రవికష్ణ, ఏలూరుకు చెందిన వి.వర్ధన్ రాజమహేంద్రవరం శుభకార్యానికి వెళ్లి వారి గ్రామానికి తిరిగి ద్విచక్ర వాహనం పై వస్తున్నారు. అయితే వారి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో ఏర్పడిన సాంకేతిక లోపంతో రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రభుత్వా ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

చెరువులో పడి యువకుని మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

కూలి పనులు చేస్తున్న వ్యక్తికి ఫిట్స్ రావడంతో బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇవి.. అప్పనపల్లిలో వేగి శ్రీనివాసరావుకి చెందిన చేపల చెరువు వద్ద బి.దొడ్డవరానిక చెందిన కుంచె దుర్గాప్రసాద్ (32) చేపల చెరువు వద్ద కూలి పని చేస్తున్నాడు. ఈ సమయంలో ఫిట్స్ రావడంతో చెరువులో పడిపోయాడు. రెండు గంటల వరకు సమీపంలో ఎవ్వరు చూడకపోవడంతో చనిపోయాడు. మృతుడు పెద్దన్నయ్య కుంచె శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్ఐ చైతన్య కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

గురజనాపల్లి రొయ్యల చెరువుల వద్ద పనిచేసే ఒక వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గురజానపల్లి గ్రామానికి చెందిన రైతులకు సంబంధించి రొయ్యల చెరువుల వద్ద అదే గ్రామానికి చెందిన మృతుడు మరుకుర్తి సత్తిబాబు (39) పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలానికి ఎస్ఐ చేరుకున్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గోదావరి విశ్వవిద్యాలయానికి పురస్కారాలు

ప్రజాశక్తి-రాజానగరం

జెఎన్‌టియుకె 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియు)కి అత్యధిక అవార్డులు వచ్చాయని విశ్వవిద్యాలయం కులపతి, చైతన్య సంస్థల చైర్మన్ కెవివి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు), విసి డాక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. జిజియు ప్రాంగణంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. దీనిలో చైతన్య రాజు మాట్లాడుతూ గైట్ అటానమస్ కళాశాల నాక్-ఎ ప్లస్‌ప్లస్ అక్రిడేషన్‌తో వరుసగా ఆరోసారి ప్రతిష్టాత్మకమైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధించినందుకు గైట్ కళాశాల, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. అప్‌గ్రెడేషన్ అవార్డును జిజియు రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రావు, జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఉపకులపతి మురళీకష్ణ అందజేశారని చెప్పారు. అనుబంధ కళాశాలల పరిధిలో గైట్ అటానమస్ కళాశాల మెకానికల్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, సిఎస్ఇ విభాగం ఆచార్య డాక్టర్ బి.సుజాత ఉత్తమ అధ్యాపక పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను చాన్సలర్ చైతన్య రాజు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అభినందించారు. దీనిలో డాక్టర్ ఎన్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న దూసర్లపూడి

అర్బన్ విలీనం గ్రామాలను కార్పొరేషన్‌గా అప్ గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం రమణయ్యపేటలో జరిగి న సమావేశంలో పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం రూరల్ గ్రామాలకు రు.998 కోట్లు, అర్బన్ గ్రామాలకు రు.454 కోట్లు కేటాయించినా కాకినాడ విలీన గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు దక్కలేదన్నారు. దీనికి కారణం పంచాయతీ రాజ్ నుంచి ఆయా గ్రామాలను కార్పొరేషన్‌లోకి విలీనం చేయడం వల్ల మాత్రమేనని అన్నారు. కాకినాడ కార్పోరేషన్‌కు చేరిన గ్రామ రికార్డులు వెనక్కి వెళ్లిన విధానంపై జ్యూడిషియల్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

23న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు, కాజులూరు

తాళ్ళరేవు, చొల్లంగి సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 23వ తేదీ ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 1: 30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయను న్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఈఈ ఉదయభాస్కర్ తెలిపారు. తాళ్లరేవు, పి. మల్లవరం, జార్జిపేట, గాడిమొగ, బైరవపాలెం, పోలేకుర్రు పంచాయతీల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు, సీతారాం పురం, కోరంగి, పెద్ద బొడ్డు వెంకటాయపాలెం, చిన్న బొడ్డు వెంకటయపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట, జి. వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూలకు విద్యుత్ సరఫరాకు అంతరాయము కలుగుతుందని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే కాజులూరు సబ్ స్టేషన్‌లో గల 11 కెవి ఫీడర్స్ పరిధిలోని కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం,.శీల, ఒంటితాడి, పల్లిపాలెం ఏరియాలోని ఆక్వా, పరిశ్రమలకు సంబంధించి విద్యుత్ సరఫరాను నిలపుదల చేయడం జరుగుతుందని ఈఈ ఎన్.ఉదయ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఎలుకల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం



ఎలుకల నిర్మూలనపై సూచనలు ఇస్తున్న జ్యోతి

పంటలకు అధికంగా నష్టాన్ని చేకూర్చే ఎలుకల నిర్మూలనకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి పిలుపు నిచ్చారు. బుధవారం సిరిపురంలో నిర్వహించిన 5వ వారం పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎలుకల బెడద అధికంగా ఉన్నందున రైతులు ముందుగా సజీవ బొరియలను గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు ఒక హెక్టారులో 50 సజీవ బొరియలు ఉంటే బ్రోమో డయోలిన్ మందును వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నూతన ఒప్పందం పట్ల హర్షం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఎటువంటి కోతలు లేకుండా మాక్సిమం స్కేలు ఇస్తామని ప్రభుత్వం అంగీకరిస్తూ ఒప్పందం చేసుకోవడంపై ఎపి స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(327) కంపెనీ సెక్రటరీ పిఎస్ఎస్.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 2022లో విద్యుత్ శాఖ ఉద్యోగులకు సంబంధించి నూతన ఒప్పందం జరిగిందన్నారు. అయితే ఆ ఒప్పందం ప్రకారం నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదన్నారు. పైగా ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఆ ఉత్తర్వులు ప్రకారం మాస్టర్ స్కేల్ అమలు చేయకుండా ప్రతి క్యాడర్‌కి టైం స్కేల్ పెట్టిందన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు టైం స్కేల్ అమలు చేస్తున్నారని, దీనివల్ల సీనియర్ మోస్ట్ ఉద్యోగస్తులకు, రిటైర్ అయిన ఉద్యోగస్తులకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర విద్యుత్ జెఎసి చేసిన చర్చలు సాగించిందన్నారు. ఎటువంటి కోతలు లేకుండా రూ.2.60 లక్షల వరకూ మాక్సిమం స్కేలు ఇస్తామని యాజమాన్యానికి, జెఎసి మధ్య ఒప్పందం జరిగిందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వానికి, ట్రాన్స్‌కో యాజమాన్యానికి, ఉద్యోగ జెఎసికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'సిరిపల్లి'లో నిషేధిత జాబితాలో అనధికార లే ఔట్

ప్రజాశక్తి-అయినవిల్లి

మండలంలోని సిరిపల్లి గ్రామం నందు గల సర్వే నెంబర్ 151-2 నందు 1.25 ఎకరాలు నందు నిర్మించిన అనధికార లేఔట్‌పై గతంలో అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అధికారులకు మరియు సర్వోన్నత న్యాయ స్థానం (సుప్రీం కోర్టు) వారికి పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదు విచారణ చర్యల్లో భాగంగా బుధవారం అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ వారు ఈ అనధికార లేఔట్‌ను ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా లే ఔట్‌గా వేశారని, ఈ కారణంగా ఈ అనధికార లేఔట్ నందు ప్లాట్లు లేదా స్థలములు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఈ అనధికార లేఔట్‌లో ప్లాట్లు లేదా స్థలములు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు అని మరియు మౌలిక వసతులు అనగా కరెంట్, నీరు, డ్రెయిన్, ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు కల్పించబడవని అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని దమ్మెన్నులో కోదండ రామాలయం పునర్నిర్మాణానికి పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ తెలిపారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయం శిథిలం అయిపోవడంతో పునర్నిర్మాణం కోసం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.40 లక్షల అంచనాతో పునర్నిర్మించ తలపెట్టిన దేవాలయానికి చందాలు ఇచ్చేందుకు సుముఖత తెలిపిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, కొర్లేపర సూర్య భాస్కరరావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, మిద్దే సత్యనారాయణ, ఈడుపుగంటి సత్యనారాయణ, పాలూరు కొండయ్య, రాగిపాటి సత్యనారాయణ, పోబోలు నాగరాజు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-కడియం

గ్రామాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మండలంలోని దుళ్ల గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు గ్రామంలోని రోడ్లకు రెండు వైపులా, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని, గ్రామాన్ని సుందరీకరణ చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. గ్రామంలో ప్లాస్టిక్ రహిత వాతావరణం కలిగించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టల్ సిబ్బంది తీరుతో ఖాతాదారుల ఇక్కట్లు

ప్రజాశక్తి-కడియం

పోస్టాఫీసు అంటే నమ్మకానికి చిరునామా పల్లెల నుంచి పట్టణాలు, నగరాల వరకూ ఏ చిన్న ఉత్తరం వచ్చినా భద్రంగా అందజేసి విశ్వసనీయత చాటుకునే వ్యవస్థగా పేరుంది. కడియం పోస్ట్ ఆఫీస్ పనితీరు మాత్రం అధ్వానంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని. ఖాతాదారులపై చులకన భావంతో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీరి పని తీరుపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిరంకుశ ధోరణిలో సమాధానం చెబుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాచుకున్న సొమ్ము తమ అవసరాలకు తీసుకుందామంటే అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వారి అలసత్వంతో గంటలు, గంటలు వేచి ఉండడంతో తమ పనులు కొనసాగటం లేదని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కడియం పోస్ట్ ఆఫీస్ పని తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. కొందరైతే ఆ శాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కలవలపల్లి పిహెచ్‌సిలో తనిఖీ

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ జె.సంధ్య తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ కె.చంద్రబాబు, డాక్టర్ ఎన్ఆర్.శోక్ చంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న ఎడిఎంహెచ్ఒ సరిత

పెద్దాపురం గ్రూప్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం గ్రూప్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎడిఎంహెచ్ఒ డాక్టర్ సరిత అన్నారు. బుధవారం 150 మంది గర్భిణీలు, వృద్ధులు భోజనాలు చేశారు. ఈ భోజన కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె గ్రూపు సభ్యులను అభినందించి మాట్లాడారు. గత 23 వారాలుగా దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రూపు సభ్యులు ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూషారాయ్, హెడ్ నర్స్ రమాదేవి, స్టాఫ్ నర్స్ జైభవాని, మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు నవీన్, నాని, దేవత రాజేష్‌కుమార్, రాఘవ, జయశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.



రుణ రద్దు పత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

ఫైనాన్స్, ఇన్సూరెన్స్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక లారీ యూనియన్ కార్యాలయము వద్ద లారీ ఓనర్స్‌తోపాటు పలువురు వాహన దారులకు స్థానిక శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఫైనాన్స్ రీజనల్ హెడ్ ఎల్‌శ్రీనివాసరావు తమ సంస్థ అందించే ఋణ సౌకర్యంతోపాటు ఇన్సూరెన్స్‌పై కలిగే లాభాలు గురించి వివరించారు. సామర్లకోటలో ఇటీవల మృతి చెందిన లారీ ఓనర్‌కు చెందిన లారీపై అప్పును రద్దు చేసి క్లియరెన్స్ పేపర్లు యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మేనేజర్లు, శ్రీరామ్ ఫైనాన్స్ సిబ్బంది, లారీ ఓనర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

'సిఎస్ఆర్' నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల ద్వారా మంజూరైన పనులకు నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో సిఎస్ఆర్ నిధుల కింద మంజూరైన పనుల పురోగతి మీద సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీస్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2019 -20 సంవత్సరం నుంచి ఇప్పటివరకు సిఎస్ఆర్ నిధుల ద్వారా కోనసీమ ప్రాంతంలో ఎన్ని పనులు మంజూరయ్యాయో అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో సిఎస్ఆర్ నిధుల కింద పనులు చేయడానికి పరిపాలన అనుమతులు లభించి ఇప్పటివరకు ప్రారంభం కాని పనుల గురించి ఎందుచేత ప్రారంభం అవ్వలేదో ఆరా తీశారు. గతంలో మంజూరయ్యి ఇంకా మొదలుకాని పనులు ఇప్పటికీ ఫీజబుల్‌గా ఉన్నాయా? వాటి స్థానంలో ప్రాముఖ్యత ఉన్న పనులు ఏవైనా చేసుకోవచ్చా అనే కోణంలో అధికారులను నివేదిక సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు కోనసీమ ప్రాంతంలో సిఎస్ఆర్ కింద పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు భవనాలు, డ్రెయిన్‌లు, హెడ్ వర్క్స్, తదితర శాఖల కింద 547 పనులు రూ.87.25 కోట్ల అంచనా వ్యయం తో పరిపాలన అనుమతులు మంజూరు చేశారన్నారు. వీటి లో రూ.25.07కోట్లతో 205 పనులు పూర్తయ్యాయన్నారు. రూ.26.14 కోట్లతో 162 పనులు పురోగతిలో ఉన్నాయని 180 పనులు ఇప్పటివరకు వివిధ కారణాల చేత ప్రారంభం కాలేదని తెలిపారు. నిధులు విడుదలవ్వక పెండింగ్లో ఉన్న పనులకు తక్షణమే నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, ఇఇ పంచాయతీరాజ్ చంటిబాబు, ఇఇ ఆర్‌డబ్ల్యుఎస్ ఎం.సురేష్‌బాబు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, అమలాపురం మున్సిపల్ కమిషనర్ మనోహర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుండీల ద్వారా రూ.15.8 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం



ఆదాయాన్నిలెక్కిస్తున్న సిబ్బంది

స్థానిక మరిడమ్మ ఆలయ హుండీల ఆదాయం రూ.15,83,217 సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహన్‌రావు తెలిపారు. ఆలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, మహారాణి సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్, తనిఖీదారు చల్లా బాబునాయుడు, పోలీసుల సమక్షంలో 29 రోజుల మధ్య కాలానికి సంబంధించిన ఆలయ హుండీలను తెరిచి లెక్కింపు జరిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి - కరప

విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. బుధవారం మండలంలోని ఉప్పలంక గ్రామంలో జరిగిన ఈ సదస్సులో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ పాల్గొన్నారు. వరదలు, సునామీలు, తుపాను సమయంలో చేయవలసిన ప్రథమ చికిత్స, రక్తస్రావం నియంత్రణ పద్ధతులు, తల గాయం, లిఫ్టింగ్, మూవింగ్, సిపిఆర్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాచర్రావు, పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, గ్రామ పెద్దలుపాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వృద్ధుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ కోరారు. బుధవారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నమవ్వడంతో వృద్ధులపై శ్రద్ధ తగ్గిందని అన్నారు. పిల్లలు కనక తల్లిదండ్రులను చూడకపోతే ఆర్‌డిఒ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ రేలంగి బాపిరాజు, గల్లా సుబ్బారావులను ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమంలో పి.పార్థసారథి, ఎస్.శ్రీనగేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాఘవరావు, అడబాల సత్యనారాయణ పాల్గొన్నారు.